Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్కూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను

• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్సీ ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 348 | హైదరాబాద్ | బుధవారం 04 నవంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



పేదరికం కరిగిపోయింది

- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- 50 కోట్ల మందికి విముక్తి
- 12 ఏళ్లలో ఘనమైన పరివర్తన
- మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- కరువు రైతులను కేంద్రం ఆదుకుంటుందని ప్రధాని భరోసా
- పుణేలో పింక్‌లైన్ మెట్రో ఆవిష్కరణ
- మరో 4 కారిడార్లకు శంకుస్థాపన

పుణే, నవంబరు 03 (ప్రజాతీర్పు)

దేశంలో గత పన్నెండేళ్లలో యాభై కోట్ల మంది ప్రజలు కటిక పేదరికం కోరల్లోంచి బయటపడ్డారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచబ్యాంకు తాజా నివేదికను ప్రస్తావిస్తూ ప్రకటించారు. గతంలో పేదరికాన్ని తొలగించడం కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఆయన -2వ పేజీలో



దేశ వ్యతిరేకులన్న వ్యాఖ్యలపై చర్చకు సిద్ధమా?

- ప్రధానికి రాహుల్ సవాల్
- ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు రెడీ అన్న ప్రతిపక్ష నేత
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌పైనా చర్చిద్దామని పిలుపు

న్యూఢిల్లీ, నవంబరు 03 (ప్రజాతీర్పు)

ప్రతిపక్షాలను దేశ వ్యతిరేకులంటూ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీకి సవాలు విసిరారు. విదేశీ శక్తులతో సంబంధాలు ఉన్నాయన్న తన ఆరోపణలపై మోదీ ఇప్పటివరకూ పరువు నష్టం దావా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. విదేశీ శక్తుల సాయంతో ప్రతిపక్షాలు దేశాన్ని అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ ప్రధాని మోదీ ఆరోపించడం.. బదులుగా రాహుల్ విదేశీ శక్తుల సాయంతోనే మోదీ ప్రధాని పీఠంపై -2వ పేజీలో



గ్రీన్ ఎనర్జీకి గ్లోబల్ క్రేజ్..

- భారత్‌కు భారీగా పెట్టుబడులు

న్యూఢిల్లీ, నవంబరు 03 (ప్రజాతీర్పు)

భారత పునరుత్పాదక ఇంధన రంగం భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. గత రెండేళ్లలోనే ఈ రంగంలోకి ఏకంగా 67 బిలియన్ డాలర్ల (సుమారు రూ.5.6 లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చాయని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోమవారం వెల్లడించారు. ఒకే రంగంలోకి ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు -2వ పేజీలో

ఎమ్మెల్యేలు ఢిల్లీకి డుమ్మా!

- సీఎంతో విబేధాలే కారణమా?
- సీఎంపై అధిష్టానం సీరియస్
- ముందస్తు సమాచారం ఇచ్చిన నలుగురు
- మిగిలిన తొమ్మిది మంది పరిస్థితి ఏమిటో?
- ఆరా తీస్తున్న టీపీసీ పెద్దలు

ఓట్ చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఢిల్లీ వేదికగా నిర్వహించిన ఆందోళన భారీగా సక్సెస్ అయ్యింది. లక్షలాదిగా జనాన్ని సమీకరించగా, ఇండి కూటమి నేతలు సైతం రాహుల్ నాయకత్వాన్ని అభినందించారు. ఈ భారీ సభకి వివిధ రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహా.. మద్దతు ఇస్తున్న పార్టీలకు చెందిన నాయకులను కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

మొత్తంగా లక్షల మందితో ఈ కార్యక్రమం విజయవంతం అయింది. కార్యక్రమం విజయవంతం అయిన విషయాన్ని పక్కన పెడితే.. తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు ఈ నిరసనకు రాకుండా డుమ్మా కొట్టడం సంచలనంగా మారింది. కర్ణాటకలో 19 మంది, తెలంగాణలో 13 మంది ఎమ్మెల్యేలు ఈ నిరసనకు రాలేదని.. అంటే.. కాంగ్రెస్ పార్టీపై సొంత నేతలకే విసుగువస్తోందని బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పంటికింద రాయిగా మారింది. దీంతో ఏయే రాష్ట్రాల నుంచి ఎవరెవరు రాలేదన్న విషయంపై అధిష్టానం నివేదికలు కోరింది. వారు ఏ కారణాలతో నిరసనకు రాలేదు? అన్న విషయాన్ని తెలుసుకోవాలని.. వారి నుంచి వివరణ తీసుకోవాలని కూడా పార్టీ కోరింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఆఘమేఘాలపై ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు రెడీ అయింది. అధికార పార్టీ ఎమ్మెల్యే ఎందుకు రాలేదన్న విషయమై పార్టీ అధిష్టానం సీఎం రేవంత్‌రెడ్డిని సైతం ప్రశ్నించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల డుమ్మా విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కూడా తీవ్రంగానే భావిస్తున్నారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఆందోళనకు తెలంగాణలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలు భారీగా జనాన్ని తరలించారు. అయితే, రాష్ట్రం నుంచి మొత్తం 13 మంది ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదని అధిష్టానానికి నివేదికలు వెళ్లాయి. ఇందులో నలుగురు ఎమ్మెల్యేలు ముందస్తు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తమ ఇళ్లలో -2వ పేజీలో

మహారాష్ట్ర ముంపు బాధితులకూ పరిహారం

- తుమ్మిడిహట్టిపై సీఎం సమీక్ష
- మహారాష్ట్రతో నిరంతర చర్చలు: రేవంత్

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం.. ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్రతో సమన్వయం, ముంపు సమస్యలు, పరిహారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ప్రాజెక్టు కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని కీలక పత్రాలను ఆ రాష్ట్ర అధికారులకు అందజేయాలని రేవంత్ స్పష్టం చేశారు. అలాగే, ముంపునకు గురయ్యే భూములకు -2వ పేజీలో

షా టార్గెట్?

కాంగ్రెస్‌పై విమర్శల అస్త్రం

- పాదయాత్ర సక్సెస్
- కలిసి పని చేసిన కమలనాథులు
- పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం
- అధికారమే లక్ష్యంగా దూకుడు

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తెలంగాణను టార్గెట్ చేశారు. హైదరాబాద్ వేదికగా ఆయన నిర్వహించిన మహాపాదయాత్ర, బహిరంగ సభ సక్సెస్ అయింది. నిజాం కాలేజీ గ్రౌండ్స్ నుంచి ఎంజే మార్కెట్ వరకు వేలాది మంది కార్యకర్తలతో కలిసి ఆయన స్వయంగా పాదయాత్రను నడిపించడం రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏకకాలంలో లక్ష్యంగా చేసుకుంటూ అమిత్ షా సంధించిన రాజకీయ అస్త్రాలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీ నిర్వహించిన సభపై అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దొంగ ఓట్లను ఏమాత్రం సహించేది లేదని, ప్రతి చొరబాటుదారుడి పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే కాకుండా దేశ సరిహద్దుల నుంచే శాశ్వతంగా తరిమికొడతామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ జీవితంలో ఎప్పటికీ ప్రధాని కాలేరని ఎద్దేవా చేస్తూ ఆయన వ్యక్తిగత మహారాజా ఆశలపై నిప్పులు చెరిగారు.

తెలంగాణ రాజకీయాలపై ఫోకస్

తెలంగాణ రాజకీయాలపై అమిత్ షా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రాష్ట్రంలో 'ఆర్ఆర్' ట్యాక్స్ నడుస్తోందని, ఆ అంటే రాహుల్... ఆర్ అంటే రేవంత్ అని అభివర్ణించారు. ఇక్కడ వసూలు చేస్తున్న ఈ ప్రత్యేక ట్యాక్స్ సొమ్ము ఎక్కడికి వెళ్తుందోనంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణను ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంలా -2వ పేజీలో



ఏఐ, డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేయండి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన తనయుడు రామ్‌చరణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన అమిత్ షాతో) వారిద్దరూ 'ఐటీసీ కాకతీయ'లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఐ దుర్వినియోగం, డీప్ ఫేక్‌లకు అడ్డుకట్ట వేయాలని చిరంజీవి కోరారు. కళాకారులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర రీతిలో -2వ పేజీలో



ఇది కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన కరువు

- కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరాన్ని పడావు పెట్టారు
- గోదావరి జలాలను పొలాలకు పారిస్తేనే మల్లావర్ధుల సదాశివుడికి నిజమైన నివాళి: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 03 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడటానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తలాపున గోదారి పారుతున్నా మన చేలు, చెలకలు ఎడారిగా మారుతున్నాయని ఆయన అన్నారు. 'కేసీఆర్‌పై అక్కసు తో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టి రైతులకు(ఖీఖతీఎవతీం) సాగునీరు అందకుండా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్నది. ఇది కా లం తెచ్చిన కరువు కాదు.. పాలకులు -2వ పేజీలో

నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు!



- ఫోటోషాప్‌లో ఎడిటింగ్.. కలర్ ప్రింటింగ్
- భారీగా నకిలీ కరెన్సీ
- రూ. 6.7 కోట్లు పట్టివేత
- యూట్యూబ్ లో చూసి తయారీ

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

రంగారెడ్డి జిల్లాలో భారీ నకిలీ నోట్ల కరెన్సీ రాకెట్‌ను పోలీసులు పట్టుకున్నారు.లి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద తనిఖీల్లో దొరికిన ఆధారాలతో దర్యాప్తు జరిపి లిహయత్ నగర్ పరిధిలోని కుంట్లూరులో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ను గుర్తించారు.లి ఈ ఇంటిపై దాడి చేయగా పంపిణీకి సిద్ధం చేసిన లిరూ.6.7 కోట్ల నకిలీ కరెన్సీ నోట్లను సీజ్ చేశారు.లి ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి వెల్లడించారు. నిందితుల నుంచి మొత్తం రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇవాళ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నవంబర్ ఒకటి రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ లో పోలీస్ స్టేషన్ సమీపంలోని బాలాజీ దాబా వద్ద వాహన తనిఖీలు చేశారు. విజయవాడకు -2వ పేజీలో

పేదరికం కరిగిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. పుణేలో మూడో మెట్రో లైన్ (పింక్ లైన్)ను మంగళవారం ఆవిష్కరించిన ప్రధాని మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం 1,200 కిలోమీటర్ల పొడవైన మెట్రో నెట్‌వర్క్ పనిచేస్తోందని, 2014కు ముందు ఇది కేవలం 248 కిలోమీటర్లు మాత్రమేనని తెలిపారు. నగరాల మౌలిక సదుపాయాలు మెరుగైతే దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి మరింత జోరు అందుకుంటుందని అన్నారు. పుణే మెట్రో రెండో దశలో భాగంగా రూ.21,800 కోట్లతో చేపట్టనున్న నాలుగు కొత్త రూట్లకు మోదీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రజలు 2014లో దేశసేవ కోసం ఎన్డీయేకు అవకాశమిచ్చినప్పుడు నగరాల్లోని మధ్యతరగతి ప్రజల జీవితాలను, రవాణాను సులభతరం చేయాలన్న కృత నిశ్చయంతో ముందడుగు వేశామని ప్రధాని తెలిపారు. మహారాష్ట్రలో కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా వారిని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొంతవరకూ సాయం అందించిందని, ఎన్డీయే ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలుస్తుందని చెప్పారు. కలిసికట్టుగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కొందామని అన్నారు. ఈ పండుగల సీజన్‌లో దేశ ప్రజలు కూడా కరువుతో అల్లాడుతున్న రైతులను గుర్తు చేసుకోవాలని, రైతులు కూడా ఈ దీపావళిని ఆనందంగా జరుపుకునేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచబ్యాంకు పేదరికంపై ఇటీవల విడుదల చేసిన సూక్ష్మ నివేదికను ప్రస్తావిస్తూ.. గతంలో పేదరిక నిర్మూలన ప్రకటనలకు పరిమితమైతే..ఇప్పుడు క్షేత్రస్థాయిలో పేదరికాన్ని తొలగిస్తున్నామని చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధికి, పేదరిక నిర్మూలనలు రెండూ ఒకదానితో ఒకటి సంబంధమున్న అంశాలని... మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు పెరుగుతున్న కొద్దీ సంక్షేమ పథకాలూ ఎక్కువవుతాయని, తద్వారా ప్రజల జీవితాలు మెరుగవుతాయని కొత్త ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రధాని వివరించారు. ప్రజలకు ఉట్టిగా సాయం చేయడం కంటే వారిని సాధికారులుగా మార్చాలన్న విధానాన్నే ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు.

మౌలిక సదుపాయాల్లో 'పరివర్తన'

పట్టణ రవాణా మౌలిక వసతుల్లో వచ్చిన పరివర్తన గురించి ప్రధాని నరేంద్ర మోదీ సోదాహరణంగా వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద మూడు మెట్రో నెట్‌వర్క్‌లలో భారత్ ఒకటిగా ఎదిగిందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా మెట్రో సౌకర్యాలు వేగంగా విస్తరిస్తూండటం ప్రభుత్వ ముందుచూపునకు, ప్రజల అవసరాలు తీర్చాలన్న సంకల్పానికి నిదర్శనాలన్నారు. దీనివల్ల ప్రయాణ సమయం ఆదా అయి ఉత్పాదకత పెరుగుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో లక్ష కోట్ల రూపాయలతో 'అర్బన్ చాలెంజ్ ఫండ్'ను ఆమోదించిందని చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో పట్టణాభివృద్ధికి భారీ పెట్టుబడులను సమీకరించడం ఈ నిధి లక్ష్యమని పేర్కొన్నారు. చిన్న పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చేందుకు స్థానిక సంస్థలు, ప్రైవేట్ రంగం కలిసి యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని పిలుపునిచ్చారు.



రాజీనామా చేసి
మళ్లీ ఎన్నికలకు వెళ్లండి

- మీడియాతో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్. చిత్రంలో ప్రొఫెసర్ హరగోపాల్
- తొలగించిన 13 కోట్ల మంది ఓటర్లు ఏఎస్‌డీఈ, విదేశీ ఓటర్లేనని అమిత్ షా అన్నారు
- అయితే 2024, 2019, 2014 ఎన్నికలు, ప్రభుత్వాలు చట్టబద్ధమేనా?
- రాజీనామా చేసి 'సర్'తో శుద్ధి చేసిన జాబితాతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి
- అమిత్ షా వ్యాఖ్యలపై ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ ఫైర్

హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చి తన పదవిని దిగజార్చుకునేలా వ్యాఖ్యానించారని ప్రముఖ ఆర్థిక వేత్త, రాజకీయ వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్ విమర్శించారు. 'సర్'పేరుతో దేశంలో తొల గించిన 13 కోట్ల మంది ఓటర్లు చనిపోయిన, వలస పోయిన, డూప్లికేట్ (ఏఎస్‌డీడీ), విదేశీ ఓటర్లేనని అమిత్ షా వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 'ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్) 2025లో ప్రారంభమైంది. అంతకు ముందు నాటి ఓటర్ల జాబితాలో విదేశీయులతోపాటు చనిపోయిన, వలసవెళ్లిన, డూప్లికేట్, మరణించిన ఓటర్లు ఉండి ఉంటే వరుసగా 2024, 2019, 2014లో జరిగిన ఎన్నికల ప్రాతిపదికన ఏర్పడిన చట్టసభలు, ప్రభుత్వాలు చట్టవిరుద్ధమా..కాదా'అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ప్రశ్నించారు. 'లోపభూయిష్టమైన ఓటర్ల జాబితాతో 2024లో ఏర్పడిన ప్రభుత్వంలో ఉన్నందుకు సిగ్గుపడుతూ తక్షణమే రాజీనామా చేయండి. 'సర్'తో శుద్ధికరించిన ఓటర్ల జాబితాతో మళ్లీ మీ ముందుకు వస్తామని ప్రజలకు ప్రకటించండి'అని అమిత్‌షాకు సూచించారు. 'సర్'పై నిజనిర్ధారణలో భాగంగా తెలంగాణ ఓటర్స్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో ముషీరాబాద్, తిరుమలగిరిలో నిర్వహించిన బహిరంగ విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను వెల్లడించడానికి మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి బహిరంగ విచారణకు అమిత్‌షా, ఆయనకు మద్దతు ఇచ్చేవారు హాజరై ఓటు హక్కు కోల్పోయిన సామాన్య ప్రజల ఆగ్రహం, ఆక్రోశం తెలుసుకోవాలని హితవు పలికారు.తాము చనిపోలేదు, ఎక్కడకీ వెళ్లలేదు, తాము డూప్లికేట్ కాదు, మరెక్కడా ఓటు లేదు, విదేశీయుడిని కాదని, అయినా నా ఓటును తీసేశారని..తిరుమలగిరిలోని 150, 151వ పోలింగ్ బూత్‌ల పరిధిలో బహిరంగ విచారణలో హాజరైన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారని, ఈ కార్యక్రమంలో తాను జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించానని పరకాల వెల్లడించారు. వలస వెళ్లారనే కారణంతో అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, నియోజకవర్గాల్లో భారీగా ఓటర్లను తొలగించారని, మరీ వీరంతా వలస వెళ్లిన రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గాల్లో ఆ మేరకు ఓటర్ల సంఖ్య పెరగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరి దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. ఎక్కడైనా ఒక్క ఓటూ పెరిగిన దాఖలాలున్నాయా అని నిలదీశారు.

గతంలో 'సర్'జరగనే జరగలేదు

ఈసీ చెబుతున్నట్టు 2002లో చేసింది స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కాదని, అప్పుడు కేవలం ఇంటెన్సివ్ (విస్తృత) పద్ధతిని మాత్రమే అనుసరించారని పరకాల ప్రభాకర్ ఆరోపించారు. దేశంలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా 'సర్'జరగలేదని, ఇదే తొలిసారి అని స్పష్టం చేశారు. నిజంగానే 2006లో చివరిసారిగా 'సర్'నిర్వహించి ఉంటే మరి ఇప్పుడు 2002 జాబితాతో ఓటర్లను ఎందుకు మ్యాపింగ్ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించారు. ప్రొఫెసర్ పద్మజషా, నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ ప్రతినిధి సిస్టర్ మంజుల, విద్యావేత్త మారియా తబస్సుమ్, విస్సా కిరణ్, సునీత తదితరులు మాట్లాడారు.

ఎమ్మెల్యేలు ఢిల్లీకి డూమ్మా!

(మొదటి పేజీ తరువాయి)

శుభకార్యాలు ఉండటం వల్ల నిరసనకు రాలేకపోతున్నామని విన్నవించినట్లు సమాచారం. వారిని వదిలేస్తే మిగిలిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. సీఎం రేవంత్‌తో సఖ్యత లేని కారణంగానే వారు నిరసనకు హాజరు కాలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏకంగా బీజేపీ అయితే, కాంగ్రెస్ నిరసనను సొంత పార్టీ ఎమ్మెల్యేలే పట్టించుకోలేదని ఎద్దేవా చేస్తోంది. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టిన విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధిష్ఠానం వారికి సంబంధించిన వివరాలతో నివేదికలు రెడీ చేయాలని.. ఢిల్లీకి పంపించాలని సూచించారు. దీంతో పార్టీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ విషయంపై నివేదికలు రెడీ చేసినట్టు తెలిసింది. అయితే.. పలువురు ఎమ్మెల్యేలకు.. మంత్రులతో దగ్గర సంబంధాలు ఉండడంతో మంత్రులు వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

మహారాష్ట్ర ముంపు బాధితులకూ పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. పరిహారం చెల్లింపుల కోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని రేవంత్ స్పష్టం చేశారు. ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని, మహారాష్ట్ర అధికారులకు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారాన్ని అందించాలని అధికారులను ఆజ్ఞాపించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తూ, మహారాష్ట్రతో చర్చలను నిరంతరం కొనసాగించాలని సీఎం సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై స్పష్టతతో ముందుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో తుమ్మిడిహట్టి బ్యారేజ్ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్రతో చర్చలు, ముంపు భూముల సర్వే, పరిహారం చెల్లింపు అంశాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు!

(మొదటి పేజీ తరువాయి)

నకిలీ నోట్లు తరలిస్తున్నారన్న సమాచారంతో మారుతి డిజైర్ కారును అడ్డగించి తనిఖీలు చేయగా, వారి వద్ద 1600 నకిలీ రూ.500 నోట్లను గుర్తించారు. అంతే కాకుండా నకిలీ పోలీస్ ఐడీ కార్డులు, డమ్మీ పిస్టల్, రెండు వాకీటాకీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా కుంట్లూరులో అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అక్కడ కూడా తనిఖీలు నిర్వహించి రూ.6.70 కోట్ల నకిలీ నోట్లను పోలీసులు సీజ్ చేశారు.

నోట్లు ఎలా ముద్రించారంటే?

ఒరిజినల్ రూ.500 నోట్లను స్కాన్ చేసి ఫోటోషాప్ ద్వారా ఎడిట్ చేసి కలర్ ప్రింటర్లతో నకిలీ నోట్లు ముద్రించినట్లు విచారణలో తేలింది. యూట్యూబ్, సోషల్ మీడియా వీడియోల ద్వారా నకిలీ నోట్ల తయారీ విధానాన్ని నేర్చుకున్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా నోట్ల తయారీకి కలర్ ప్రింటర్లు, లేజర్ ప్రింటర్లు, ల్యాప్‌టాప్, స్కానర్, లామినేషన్, కరెన్సీ కటింగ్ మిషీన్ వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. వీరు నకిలీ నోట్ల ముద్రనే కాకుండా, చేసు కు ని పోలీసులమంటూ బెదిరింపులు, వసూళ్లకు పాల్పడినట్లు కూడా దర్యాప్తులో తేలింది.

షా టార్గెట్?

(మొదటి పేజీ తరువాయి)

మార్చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి అరాచకాలు పెరిగిపోయాయని, వాటికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రజావ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకునేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని ఈ విమర్శలు స్పష్టం చేస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులలో ఈ పర్యటన భారీ ఉత్సాహాన్ని నింపింది. ఇటీవల కాలంలో తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జాతీయ నాయకత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ మహాపాదయాత్ర ఒక మైలురాయిగా నిలిచింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా స్థానిక అంశాలను, జాతీయ భద్రతా కోణాలను ముడిపెట్టి అమిత్ షా చేసిన ప్రసంగం కిందిస్థాయి క్యాడర్‌లో సరికొత్త దూకుడును తెచ్చింది. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ మరింత దూకుడుగా వ్యవహరించడానికి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడానికి ఈ సభ ఒక బలమైన వేదికగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముమ్ముందు ఈ రాజకీయ మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు, గ్రూపు తగాదాలు, ఆధిపత్య పోరాటాలు తరచూ బహిర్గతమవుతూ పార్టీకి తలనొప్పిగా మారుతున్న తరుణంలో.. ఈ యాత్ర వేదికగా నేతలంతా సమైక్యతను చాటడం విశేషం. అధిష్టానం దూతగా అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగడంతో, క్షేత్రస్థాయి నాయకత్వం తమ మధ్య ఉన్న ఈగోలను, లోపాయికారీ విభేదాలను పూర్తిగా పక్కనపెట్టింది. బహిరంగంగా పార్టీ ప్రతిష్టకు ఎలాంటి నష్టం కలగకుండా, క్రమశిక్షణతో కూడిన సమష్టి కృషితో జనసమీకరణ చేసి కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించే నాయకులు సైతం ఈ యాత్ర ముగిసే వరకు ఒకే తాటిపై నడవడం పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ పాదయాత్ర విజయవంతం కావడంతో.. ఇకపై తెలంగాణ రాజకీయాలపై అమిత్ షా తన పూర్తి స్థాయి వ్యూహాలను అమలు చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఒడిసిపట్టుకోవడానికి, పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఊపును క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి ఇకపై కేంద్ర నాయకత్వం తెలంగాణపై ప్రత్యేక నజరు సారించనుంది. నిరంతర పర్యటనలు, నియోజకవర్గాల వారీగా సమీక్షలు, ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌లతో రాష్ట్రంలో పార్టీని అధికార పీఠం వైపు నడిపించేందుకు అమిత్ షా మరింత దూకుడుగా పావులు కదపడం ఖాయమని రాజకీయ వర్గాల్లో బలంగా చర్చ సాగుతోంది.

ఏఐ, డీప్‌ఫేక్‌లకు
అడ్డుకట్ట వేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేయడాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ మేరకు భేటీ వివరాలను చిరంజీవి ఎక్స్ వేదికగా పంచుకున్నారు.'కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగం వల్ల కళాకారుల హక్కులు, గౌరవం, సృజనాత్మక కంటెంట్ తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ అంశంపై నాకున్న ఆందోళనలను ఆయనకు వివరించాను. మేము వ్యక్తం చేసిన ఆందోళనలను ఎంతో శ్రద్ధగా ఆలకించారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి, మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ఈ అంశానికి సంబంధించి లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలనీ సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసే బాధ్యతను అప్పగించారు. సినీ పరిశ్రమకు ఇది ఒక ప్రోత్సాహకరమైన ముందడుగు. ఈ విషయంలో హామీ ఇచ్చిన అమిత్ షాకు నా కృతజ్ఞతలు. త్వరలోనే కళాకారులకు అర్థవంతమైన, పటిష్టమైన రక్షణ చర్యలు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నాను' అని చిరంజీవి పేర్కొన్నారు.

దేశ వ్యతిరేకులన్న వ్యాఖ్యలపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

కూర్చున్నారని ప్రత్యారోపణ చేయడం తెలిసిందే.ఈ నేపథ్యంలో రాహుల్ మంగళవారం ఎక్స్‌లో ఒక పోస్టు చేస్తూ... "మోదీగారు.. నేను సవాలు విసిరి 24 గంటలవుతోంది. ప్రతిపక్షం యాంటీ నేషనల్ అంటున్నారు మీరు. ఏ వేదికనైనా ఎంచుకోండి. ఎక్కడైనా సరే. ఈ విషయంపై నాతో చర్చించండి. ఎవరు యాంటీ నేషనల్? విదేశీ శక్తులతో సంబంధాలున్నవారా? ఈ సంబంధాల తీరుతెన్నులేమిటి? వీలైనంత తొందరలో ఈ చర్చ చేద్దాం. ఏం భయపడవద్దు"అని వ్యాఖ్యానించారు. "మన ఇద్దరితోపాటు మీడియా కూడా ఉంటుంది. దేశ యువత కూడా హాజరవుతుంది. ఒక బల్ల ఉంటుంది. మీరు అటు.. నేను ఇటు కూర్చుందాం. మీరు ఎవరినైనా జడ్జిగా నియమించుకోండి. మోహన్ భాగవత్ గారినైనా న్యాయమూర్తిగా పెట్టుకోవచ్చు"అని బహిరంగ చర్చకు సంబంధించిన వివరాలిచ్చారు రాహుల్.ఈ చర్చలో ఆర్థిక వ్యవస్థలపై, నిర్మాణంపై ప్రశ్నలుంటాయి. "అమెరికాతో ఒప్పందం ఎలా కుదిరింది? ఎందుకు కుదిరింది? ఎందుకు అంత తొందరగా జరిగింది? కేబినెట్‌కు కూడా చెప్పకుండా ఎందుకు మీరొక్కరే ఒప్పందం చేసుకున్నారు? అదానీ కేసు ఎందుకు మూతపడింది? ఎప్‌స్టీన్ వంటి అంశాలు బోలెడు ఉంటాయి"అని అన్నారు. అన్నింటి గురించి బహిరంగంగానే మాట్లాడుకుందామని, నిజాలు బయటకు రావాలని అన్నీ తేటతెల్లం కావాలని అన్నారు. "మీరు నాపై ఆరోపణలు చేశారు. చేశారు కదా? ముందుకు రండి... అన్నీ స్పష్టమవుతాయి"అని సవాలు విసిరారు."నాపై ఇతర అంశాలకు సంబంధించి చాలా పరువునష్టం కేసులు వేశారు. నాకు తెలిసి 45 పరువునష్టం కేసులున్నాయి. కానీ ఈ చర్చకు సంబంధించి, విదేశీ సంబంధాల గురించి నాపై పరువు నష్టం కేసు వేయలేదు. వేయండి. ఆ విషయం కూడా ఓపెన్‌గా చర్చిద్దాం. దీపావళి శుభాకాంక్షలు మోదీ గారు"అంటూ తన పోస్టులో వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని చర్చకు ఆహ్వానించడం "మతోన్మాద ఇస్లామిస్టులు సెక్యులరిజమ్ గురించి మాట్లాడినట్లే ఉంది"అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వ్యాఖ్యానించారు. ఉన్నతస్థాయి చర్చలు ఇద్దరు పరిపక్వత ఉన్న వ్యక్తుల మధ్య జరుగుతాయని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీకి గ్లోబల్ క్రేజ్..

(మొదటి పేజీ తరువాయి)

రావడం దేశ చరిత్రలోనే అత్యంత పెద్ద పరిణామమని ఆయన పేర్కొన్నారు.ఢిల్లీలో జరిగిన 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో 2026'లో పాల్గొన్న ఆయన, పునరుత్పాదక ఇంధన రంగంలో సాధించిన ప్రగతిని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ శిలాజేతర ఇంధన ఉత్పత్తి సామర్థ్యం గత రెండేళ్లలోనే 50 శాతానికి పైగా పెరిగిందన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, దేశ వృద్ధి రేటు అంచనాలను పలు అంతర్జాతీయ సంస్థలు 7 శాతం వరకు సవరించాయని గుర్తుచేశారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని ప్రపంచ పెట్టుబడిదారులకు జోషి పిలుపునిచ్చారు.2014లో 2.8 గిగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్ సామర్థ్యం ప్రస్తుతం 171 గిగావాట్లకు చేరింది. పవన విద్యుత్ సామర్థ్యం 21 గిగావాట్ల నుంచి 60 గిగావాట్లకు పెరిగింది. సోలార్ మాడ్యూళ్ల ఉత్పత్తి సామర్థ్యం 2 గిగావాట్ల నుంచి 225 గిగావాట్లకు చేరగా, సోలార్ సెల్స్ తయారీ సామర్థ్యం 2014లో సున్నా నుంచి ప్రస్తుతం 45 గిగావాట్లకు పెరిగింది. విండ్ టర్బైన్ల తయారీ సామర్థ్యం కూడా 10 గిగావాట్ల నుంచి 24 గిగావాట్లకు చేరింది. ఈ అభివృద్ధి కారణంగా వినియోగదారులకు తక్కువ ధరలకే హరిత విద్యుత్‌ను అందించడంలో భారత్ పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. 2014లో యూనిట్ సోలార్ విద్యుత్ ధర రూ.5.50గా ఉండగా, ప్రస్తుతం రూ.2.15కు తగ్గిందన్నారు. సోలార్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.2.70గా ఉందని వివరించారు.ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు గ్రీన్ హైడ్రోజన్‌ను కిలో రూ.279కు, గ్రీన్ అమ్మోనియాను కిలో రూ.49.75కు అందించే స్థాయికి భారత్ చేరుకుందని మంత్రి జోషి తెలిపారు. ఈ ఏడాది భారతీయ కంపెనీలు 4 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా కోసం 18 ఒప్పందాలపై సంతకాలు చేశాయని వెల్లడించారు. 2023లో ప్రారంభించిన 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' కింద కుదిరిన ఒప్పందాల్లో 70 శాతానికి పైగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు కేటాయించారని తెలిపారు. ఈ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ద్వారా దేశంలోకి సుమారు రూ.90 వేల కోట్ల (9.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు రానున్నాయని ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.

ఇది కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన కరువు

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చిన కరువు. ఇదేదో నేను అక్కసుతోనో, కోపంతోనో చెప్తున్న మాట కాదు. మ్యాప్‌లు చూడండివాస్తవాలను ఆధారంగా చేసుకుని చెప్తున్న మాట' అని పేర్కొన్నారు. మంగళవారం ప్రముఖ కవి మల్లావఝుల సదాశివుడి స్మారక పురస్కార ప్రదానోత్సవంలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి చెమన్ సింగ్‌కు, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌కు పురస్కారాలను అందజేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు తిరునగరి దేవకిదేవి, కవ్వంపల్లి స్వామిని ప్రత్యేకంగా సత్కరించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ ఏడాది ఏడున్నర నెలల్లో గోదావరిలోకి 750 టీఎంసీల నీళ్లు, కృష్ణా నదిలోకి 258 టీఎంసీల నీళ్లు వచ్చాయని, సుమారు వెయ్యి టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వెళ్లిపోయాయని తెలిపారు. 'నీళ్లు ఎత్తండి.. రైతులను ఆదుకోండి.. అని మేం ప్రస్తుత పాలకులను కోరాం. కానీ, వాళ్లు మా విజ్ఞప్తిని పట్టించుకోలేదు. పట్టించుకోకపోగా, ఇవాళ వాస్తవాలను బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు' అని మండిపడ్డారు. రాజకీయాలు చూడండి

కేసీఆర్ ఉద్యమ పాట కూడా రాశారు

'కష్టజీవికి ఇరువైపులా నిలబడ్డవాడే కవి. గోదావరిఖని మట్టిలోనే ఏదో మహత్యం ఉంది. కన్నీటి చుక్కల నుంచే కత్తులు మొలిపించిన అద్భుత కవి మల్లావఝుల సదాశివుడు' అని కేటీఆర్ కొనియాడారు. జలసాధన ఉద్యమ సమయంలో సదాశివుడు రాసిన 'తలాపున పారుతుంది గోదారి' పాట ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో స్ఫూర్తి నింపేందుకు కేసీఆర్ స్వయంగా పాట కూడా రాశారని కేటీఆర్ ప్రస్తావించారు. '2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభించినప్పుడు తెలంగాణ వస్తుందా? ఈ ఉద్యమం సాధ్యమవుతుందా? అనే అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ప్రజల్లో నమ్మకం కల్పించేందుకు కేసీఆర్ పాట రాశారు' అన్నారు.



వాల్మీకి ఆవాసంలో ఘనంగా డాక్టర్ ఎల్. మణికంఠ జన్మదిన వేడుకలు

అనాథ విద్యార్థులకు అన్నదానం, స్వీట్లు, పండ్ల పంపిణీ

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 3.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ తనయుడు డాక్టర్ ఎల్. మణికంఠ జన్మదిన వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. డాక్టర్ మణికంఠ జన్మదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాసంలోని విద్యార్థులకు నిరుపేద మానవతా దృక్పథంతో ఒకరోజు భోజన ఖర్చుల ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు విద్యార్థులకు స్వీట్లు, పండ్లను బిఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. పిల్లల నడుమ ఈ విధంగా జన్మదిన వేడుకలను నిర్వహించి తమకు చేయూతనందించినందుకు గాను బిఆర్ఎస్ నాయకులకు వాల్మీకి ఆవాస నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీష్, నాయకులు అజ్జర్ మహమ్మద్ ఖాన్, పులి మల్లేశం గౌడ్, వసీం మహమ్మద్ అలీ, గాజుల శ్రీనివాస్, గుండేటి మారుతిలతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, ఆవాస నిర్వాహకులు పాల్గొన్నారు.



అమరవీరుల ఆశయ సాధన కోసం. పార్టీ శ్రేణులు పనిచేయాలి

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) నవంబర్ 03

టేకులపల్లి బస్ స్టాండ్ సెంటర్ లో కాచినపల్లి అమరవీరుల స్థూపం వద్ద అమరులను తలుచుకుంటూ సీపీఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మచారి జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం,అమరవీరులు త్యాగం చేశారని, బూటకపు ఎన్కౌంటర్ ద్వారా, అనారోగ్యంతో,మాఫియా మూట చేతులలో ఎంతోమంది అమరులయ్యారని. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని. ఈనెల తొమ్మిదో తారీఖు వరకు అమరవీరుల స్మారక సభలు జరపాలని. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. మండల నాయకులు జె.సుందర్,బి. పంతులు, జి. మదర్, సుడిగాలి. వెంకన్న,బి. లింగ,అరుణోదయ రాష్ట్ర నాయకులు కొండలరావు, ప్రజా సంఘాల నాయకులు ఉపేందర్, రమేష్,నవీన్, లింగ,లచ్చు పాల్గొన్నారు.



రేపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) నవంబర్ 03

కరీంనగర్ పట్టణంలోని ఉజ్వల పార్క్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా నవంబర్ 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు:

1. ఎలైట్ ఆసుపత్రి పరిసర ప్రాంతం
2. కమాన్, విశాల్ మార్ట్ ప్రాంతం
3. కిషోర్ ఆటో స్టోర్ పరిసర ప్రాంతం
4. సీపీఐ కార్యాలయ పరిసర ప్రాంతం
5. గణేష్ నగర్ ప్రాంతం

చెట్ల కొమ్మల తొలగింపు పనులు సురక్షితంగా నిర్వహించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం. లావణ్య తెలిపారు. ఈ అంతరాయాన్ని గమనించి వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆమె కోరారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

- ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తుల సమర్పించాలి

(జక్కుల శ్రీకాంత్ ప్రజా తీర్పు ప్రతినిధి) నవంబర్ 3



కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, పీజీ కోఆర్డినేటర్ మధు రాజేశ్ తెలిపారు.ఎం.ఏ. ఆంగ్లం, తెలుగు, ఎకనామిక్స్, ఎం.కామ్., ఎం.ఎస్సీ బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.ప్రవేశాలు పొందాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్ల ఒక సెట్, జిరాక్స్ సర్టిఫికెట్ల ఒక సెట్ అందజేయాలని తెలిపారు.సీపీగెట్-2026 నిబంధనల ప్రకారం స్పాట్ ప్రవేశాల్లో సీట్లు కేటాయించనున్నట్లు వారు వెల్లడించారు.

రసవత్తరంగా "హుజూరాబాద్ క్లబ్" ఎన్నికలు?

- రెండు వర్గాల మధ్య హోరాహోరీ?
- ఏకగ్రీవం అయ్యేనా? లేక ఎన్నికలు జరుగుతాయా?

హుజురాబాద్, నవంబర్ 3 ప్రజా తీర్పు ప్రతినిధి,



హుజూరాబాద్ క్లబ్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. నేటి నుండి నామినేషన్లు వేయనున్నారు. ఐదో తేదీన నామినేషన్ల పరిశీలన అరున ఉపసంహరణ, ఈనెల 15వ తేదీ ఆదివారం రోజు ఎన్నికలు జరగనున్నాయి.

క్లబ్ నేపథ్యం ఇదీ

హుజురాబాద్ క్లబ్ ఎప్పటి గత 40-50 ఏళ్ల నుండి ఉంది. అయితే దీన్ని గతంలో కొందరు ఆక్రమిద్దామని ప్రయత్నించగా.. ఆనాడు రాజ్యసభ సభ్యునిగా ఉన్న కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు దీనికి అడ్డుకట్ట వేశారు. ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దీన్ని పునరుద్ధరించారు. గతంలో పాత కోర్టు స్థానంలో కొత్త కోర్టు నిర్మించిన సమయంలో ప్రత్యామ్నాయంగా.. ఈ పాత క్లబ్ స్థానంలో కోర్టు కూడా కొద్దిరోజులు నడిచింది. కొత్తగా నిర్మించిన క్లబ్ లో ఇండోర్ షటిల్ కోర్ట్, టెన్నిస్కోర్ట్, ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్, జిమ్ తదితర సౌకర్యాలు ఉన్నాయి. ప్రముఖులందరూ కలుసుకుని వేదికగా ఈ క్లబ్ ఉంది. క్లబ్లో 200 మంది సభ్యుల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా, బతుకమ్మ సంక్రాంతి, నూతన సంవత్సరం, ఉగాది, పంద్రాగస్టు, 26 జనవరి తదితర సందర్భాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖులు కలుసుకునే వేదిక కావడంతో సహజంగానే క్లబ్ ఎన్నికల పట్ల ఆసక్తి కలిగిస్తోంది. పట్టణంలోని రాజకీయ వ్యాపార వర్గాలవారు, న్యాయవాదులు, డాక్టర్లు, వృత్తి నిపుణులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. క్లబ్ కు అధ్యక్షులుగా ఆర్డీవో వ్యవహరిస్తున్నారు.

ప్రధాన కార్యదర్శి పదవి కీలకం!

హుజురాబాద్ క్లబ్లో ప్రధాన కార్యదర్శి పదవి కీలకం. క్లబ్ నిర్వహణ అంత ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగానే జరుగుతుంది. ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు తదితర పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఇందులో చాలామంది ఆశావహులు పదవులు అడుగుతున్నారు. రెండేళ్ల పదవీకాలం ఈ కొత్త కార్యవర్గానికి ఉంటుంది.

రెండు వర్గాలుగా సభ్యులు?

హుజురాబాద్ ఎన్నికల సందర్భంగా క్లబ్ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో ఒక వర్గానికి పాత కార్యవర్గానికి సంబంధించిన వారు ఉండగా, మరో వర్గానికి కొత్తగా పోటీపడుతున్న వారు ఉన్నారు. ఎవరికి వారే గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.

కెప్టెన్ వద్దకు రెండు వర్గాలు?

క్లబ్ నిర్మాణంలో కీలక భూమిక పోషించి సలహాదారుగా ఉన్న గౌరవాధ్యక్షునిగా సేవలందిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు వద్దకు రెండు వర్గాలు వెళ్లి పరిస్థితులను వివరించినట్టు తెలుస్తోంది. అయితే ఏకగ్రీవంగా ఎన్నికలు జరగాలని అందరూ భావిస్తున్నప్పటికీ ఎవరికి వారే పట్టు పడుతుండడంతో ఎన్నిక అనివార్యంగా కనిపిస్తోంది. తాజాగా కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు మంగళవారం సాయంత్రం హనుమకొండ వెళ్లి మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావును కలిసి పరిస్థితిలను విన్నవించినట్టు తెలుస్తోంది. పాత కార్యవర్గం పై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని కానీ కొత్త వారికి కూడా అవకాశం ఇస్తే బాగుంటుందని, క్లబ్ అభివృద్ధికి తాము కూడా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. అయితే కెప్టెన్ మాత్రం మొదటి నుండి రాజకీయాలకు అతీతంగా క్లబ్ నిర్వహణ ఉండాలని, ప్రతి సభ్యుడు క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని, వివాదాలకు దూరంగా ఉండాలని పదేపదే చెప్తూ వస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు సుమారు 62 మంది వరకు కెప్టెన్ ను కలవడంతో వీరికే మద్దతు, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టుగా పలువురు భావిస్తున్నారు. ఇందులో బండ శ్రీనివాస్, క్రషర్ రవీందర్ రావు, కటుకూరి మల్లారెడ్డి కీలక భూమిక పోషిస్తున్నారు. మరో వర్గం లో ఎర్రం నారాయణరెడ్డి, ముచ్చ నారాయణరెడ్డి, కళ్లెపు మోహన్రావు, కళ్యాణ్ తదితరులు ఉన్నట్టు తెలుస్తోంది. రెండు ప్యానల్ లలో పదవులు ఆశిస్తుండగా.. చివరకు ఏం జరుగుతుంది..? రెండు వర్గాల మధ్య సయోధ్య కుదురుతుందా? లేక ఎన్నికలు జరుగుతాయా అనే ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా.. హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు.. పట్టణంలో ఎక్కడ ఇద్దరు కలిసిన పెద్ద చర్చకు తెర లేపాయి.



అర దశాబ్ద కాలంగా అన్నార్థుల ఆకలి తీర్చుతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్

వేములవాడ, నవంబర్ 03 ప్రజాతీర్పు ప్రతినిధి

ఆరధశాబ్ద కాలంగా అన్నార్థుల ఆకలి తీర్చుతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ దాతల సహకారంతో అన్నార్తులకు భక్తులకు నిరంతరం అన్నదానం నిర్వహిస్తున్నది దాతలు అందించే సహకారం వల్ల ఆకలితో ఉన్న వారి కడుపు నింపడానికి ట్రస్ట్ పనిచేస్తుందని నిర్వాహకులు మధు మహేష్ తెలిపారు, సమాజంలో ఆకలితో అలమటిస్తున్న వారికి మనకు ఉన్న దానిలో కొంత భాగాన్ని అన్నార్థులకు పంచడం మన బాధ్యతగా తీసుకోవాలన్నారు, పుట్టినరోజులు వివాహవార్షికోత్సవాలు,పండుగల సందర్భంగా అన్నదాన కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఎంతో పుణ్యమైనదని మధు మహేష్ పేర్కొన్నారు

నేటి అన్నదాతలుగా...

నూజిలాండులో ఉన్న దొంతుల కాత్యాయని పుట్టిన రోజు సందర్భంగా కాత్యాయని భర్త లావణ్ కుమార్ కుటుంబ సభ్యులు హైదరాబాదులో పుట్టినరోజు జరుపుకుంటున్న లక్కాకుల నాగశిరీష పుట్టినరోజు సందర్భంగా నాగరీష భర్త రవికుమార్ కుటుంబ సభ్యులు

శాశ్వత అన్నదాతలుగా...

జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి సాంబశివ్ శైలజ దంపతులు దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత వీరి కొడుకులు కోడళ్ళు ప్రజ్ఞ శరత్చంద్ర శిరీష సాయిచంద్ర శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష సాయికృష్ణ ఉన్నారని ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు ట్రస్ట్ ధన్యవాదాలు తెలిపుతుందని సేవాభావం కలిగినవారు ఈమహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ట్రస్ట్ సభ్యులు కోరుతున్నారు, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు



30వ డివిజన్ కార్పొరేటర్ చొరవతో దుకాణాల సమీపంలో చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు

- సత్వర స్పందనతో వ్యాపారులకు ఊరట.. కార్పొరేటర్‌కు దుకాణదారుల కృతజ్ఞతలు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) నవంబర్ 03

స్థానిక దుకాణదారుల విజ్ఞప్తికి స్పందించిన 30వ డివిజన్ కార్పొరేటర్ దుకాణాల పక్కన పేరుకుపోయిన చెత్తను, పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలోని వ్యాపారులకు ఊరట లభించింది. సాలరీ పాన్ షాప్ యజమాని మొహమ్మద్ గౌస్ దుకాణాల సమీపంలో చెత్త, పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను 30వ డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కల మధ్య వీధి కుక్కలు, పాములు సంచరిస్తుండటంతో దుకాణదారులు, వినియోగదారులు, అటుగా వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వివరించారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ట్రాక్టర్‌ను పంపించి పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ శుభ్రత కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో పాటు దుకాణాల వద్ద ప్రమాదకర పరిస్థితులు తగ్గాయని స్థానికులు తెలిపారు. సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపిన మొహమ్మద్ గౌస్‌కు, వెంటనే స్పందించి శుభ్రత చర్యలు చేపట్టిన 30వ డివిజన్ కార్పొరేటర్‌కు దుకాణదారులు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణకు ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగించాలని వ్యాపారులు కోరారు.

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు నవంబర్ 6 వరకే గడువు - గండారపు నరేష్.

(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) నవంబర్,3:



అందరికీ నమస్కారం మరో మూడు రోజులు మాత్రమే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు గడువు ఉన్నది. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నమోదు నవంబర్ 6వ తారీకు వరకు మీ ఓటర్ నమోదు చేసుకోగలరు. ప్రజా పాలన లక్ష్యంగా రేవంత్ అన్న ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థికి మీ యొక్క అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని కోరుచున్నాము. మీ మేడ్చల్ నియోజకవర్గం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గండారపు నరేష్.

పటాన్చెరులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి ఏర్పాటు కావడం సంతోషకరం

- ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చేరు, నవంబరు 3 ప్రజాతీర్పు ప్రతినిధి



పటాన్చెరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో మరిన్ని ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం పటాన్చెరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై..ఆసుపత్రిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక వైద్య సదుపాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. వైద్య సేవలు కేవలం ఆర్థిక స్థోమత కలిగిన వారికే పరిమితం కాకుండా పేదలకు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పృథ్వీరాజ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవతో 12 కోట్ల రూపాయలతో 10 స్వీపింగ్ మిషన్లు, 10 టిప్పర్లు

తోషిబా సిఎస్ఆర్ నిధులతో కొనుగోలు

పటాన్ చేరు, నవంబరు 3 ప్రజాతీర్పు ప్రతినిధి



అనునిత్యం. అనుక్షణం పటాన్చెరు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న స్థానిక శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టం చేయడంలో భాగంగా సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైబరాబాద్ మున్సిపల్ పరిధిలోని పటాన్చెరు, అమీన్పూర్ సర్కిళ్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు, కాలనీలకు అనుగుణంగా పారిశుధ్య అవసరాల కోసం తోషిబా పరిశ్రమ సహకారంతో 12 కోట్ల రూపాయలతో పారిశుద్ధ్య వాహనాలు కొనుగోలు చేసి అందించారు. సోమవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యే జిఎంఆర్, తోషిబా పరిశ్రమ హెచ్ఆర్ డైరెక్టర్ మారు మోటో చేతుల మీదుగా తొలి విడతలో కొనుగోలు చేసిన 5 టిప్పర్లు, 5 స్వీపింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014 నుండి 2023 వరకు పటాన్చెరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మూలంగా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడంతో పాటు వందల సంఖ్యలో నూతన కాలనీలు ఏర్పడ్డాయని తెలిపారు

ఇందుకు అనుగుణంగా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పటాన్చెరు, అమీన్పూర్ సర్కిల్స్ పరిధిలోగల తొమ్మిది డివిజన్లలో గల ప్రజలకు పారిశుద్ధ్య అంశంలో మెరుగైన సేవలు అందించడంలో భాగంగా నూతన వాహనాల కొనుగోలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పటాన్చెరు పరిధిలోని తోషిబా పరిశ్రమ అందించిన 12 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో 10 స్వీపింగ్ మెషీన్లు, పది టిప్పర్లు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ వీటిలో పొందుపరచడం జరిగిందని పేర్కొన్నారు. మొదటి విడతలో కొనుగోలు చేసిన వాటిలో అమీన్పూర్ సర్కిల్ కు 3 స్వీపింగ్ మిషన్లు, మూడు టిప్పర్లు, పటాన్చెరు సర్కిల్ కు 2 స్వీపింగ్ మిషన్లు, 2 టిప్పర్లు అందించడం జరిగిందని తెలిపారు. బిహెచ్ఎల్ చౌరస్తా నుండి ఇస్నాపూర్ చౌరస్తా వరకు గల జాతీయ రహదారి పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా మరో స్వీపింగ్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కాలనీ పారిశుద్ధ అంశంలో ప్రగతి సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వెయ్యకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య వాహనాలు కొనుగోలు కోసం 12 కోట్ల రూపాయలు అందించిన తోషిబా పరిశ్రమ యాజమాన్యానికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని నియమించండి. 9 డివిజన్ల పరిధిలో పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో నూతన సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడం మూలంగా ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రతిరోజు చెట్ల సేకరించకపోవడం మూలంగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి డివిజన్ పరిధిలో నూతన పారిశుద్ధ సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు

పారిశుద్ధ్య వాహనాలతో పాటు జెసిబిలు సైతం అందిస్తున్నామని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధిలో తమను భాగస్వాములను చేసినందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని తోషిబా పరిశ్రమ ఎండి మారు మోటో తెలిపారు. అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు

ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవ ప్రశంసనీయం

సీఎంసీ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ కోసం సి ఎస్ ఆర్ నిధులతో వాహనాలు కొనుగోలు చేసి అందించడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవ ప్రశంసనీయమని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కావ్య, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లలిత శ్రావణి, తోషిబా పరిశ్రమ జనరల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ మేనేజర్ రాజా, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, కుమార్ యాదవ్, సింధు రెడ్డి, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ డిసి ప్రదీప్ కుమార్, బల్దియా అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా మాసు సుధాకర్
- మహిళా కన్వీనర్ గా సౌమ్య

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 3

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ అధ్యక్షులుగా న్యాయవాది మాసు సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా మురళి శ్రావణ్ ఎన్నికయ్యారు. మంగళవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బార్ అసోసియేషన్ లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జాడి రాజేష్, దేవరాజ్, సహాయ కార్యదర్శులుగా అనిల్ కుమార్, జూబేర్, కోశాధికారిగా కుమార్, కమిటీ సభ్యులు గా గొర్లపల్లి రమేష్, సజ్జనపు సంతోష్, కందుల సందీప్, బుర్సా రమేష్, దాట్ల సతీష్, మద్దిబోయిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల ఏమాజి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సబ్బాని సాయికుమార్ వ్యవహరించారు.

మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సౌమ్య

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు మహిళా కమిటీ కన్వీనర్ గా తౌటం సౌమ్య, కో కన్వీనర్లుగా పీక మమత, అరకొండ లావణ్య, దుర్గం గౌతమి, కమిటీ సభ్యులు గా ఉమారాణి, స్వర్ణలత ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కొయ్యల ఏమాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. న్యాయవాదుల సమస్యల సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.





డిసెంబర్ 15 నుండి ఆశ వర్కర్స్ నిరవధిక సమ్మె, సమ్మె నోటీస్ ఇచ్చిన సిఐటీయు నాయకులు

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) నవంబర్ 03

టేకులపల్లి :ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం,కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల కు మేనిఫెస్టో వాగ్దానం అమలు చేయక పోవడం పై సిఐటీయు ఇతర సంఘాలతో డిసెంబర్ 15నుండి నిరవధిక సమ్మె,సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయు నాయకులు స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం డిసెంబర్ 15 తేదీనుండి నిరవధిక సమ్మె తలపెట్టినట్లు సమ్మె నోటీసు ను అధికారులకు వినతి పత్రం రూపం లో అందించారు. గత 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు సమ్మె చేసిన నేపథ్యంలో ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిఐటీయు రాష్ట్ర నాయకత్వం తో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరిపి ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ తో కూడిన కమిటీని వేస్తామని హామీ ఇచ్చింది. సమ్మె శిబిరాలలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహ మంత్రులు, ఎమ్మెల్యే లు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తారని తమ మ్యానిఫెస్టోలో ఆషా లకు 18వేల ఫిక్సు వేతనం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని దాని కారణంగా నే డిసెంబర్ 15నుండి ఇతర సంఘాలతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించి నట్లు సీఐటీయూ టేకులపల్లి కన్వీనర్ హైమ తెలిపారు.డిమాండ్ ఆశాలకు 18 వేతనం నిర్ణయించాలి ఉద్యోగ భద్రత కల్పించాలి 50 లక్షల ఇన్సూరెన్స్ మరణించిన ఆశలకు మట్టి ఖర్చులకు 50,000 రిటైర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు పారితోషికంలో సగం పెన్షన్ గా నిర్ణయించాలని ప్రతి ఆదివారం పండుగలకు సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని ప్రసూతి సెలవులు కూడా ఇవ్వాలని ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని రెండో పీయార్సిలో ఆశ వర్కర్లకు 30 వేల కనీస వేతనం నిర్ణయించాలని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డిఏలు అషాలకు వర్తింపజేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అనిన్నటిని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీమల రమణ, మల్లేశ్వరి, లక్ష్మి,ఉమాదేవి, సుశీల, ఆదిలక్ష్మి,హైమా, మజారి, సరితా తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 3 ప్రజా తీర్పు

సుజాతనగర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సుజాతనగర్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు సకాలంలో నిండకపోవడంతో అధిక శాతం మంది రైతులు వరి సాగు చేయలేకపోయారని, వరి పంట సాగు చేసిన రైతుల పంటలు సైతం నీరు లేక ఎండిపోయాయని రైతు సంఘం నాయకులు తెలిపారు. అదేవిధంగా పత్తి పంటను సకాలంలో సాగు చేయలేకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, ఎకరానికి కేవలం రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో సుజాతనగర్ మండలాన్ని చేర్చకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా సుజాతనగర్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కునుసోతు ధర్మా, సుజాతనగర్ మండల రైతు సంఘం కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాసరావు, నల్లగోపు పుల్లయ్య, మండల కమిటీ సభ్యులు కొండ కృష్ణ, బాలు వెంకటేశ్వర్లు, భూక్య శంకర్, లిక్కి నాగరాజు, కిషన్, జంగిలి వెంకన్న, గుగులోతు రత్న, కొండే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింగభూపాలెంలో ఘనంగా డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- యువత హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలి: డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధరావత్ శివ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 3 ప్రజా తీర్పు

సుజాతనగర్ మండలం సింగభూపాలెంలో డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డివైఎఫ్ఐ సింగభూపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేల్పుల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ శివ ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధరావత్ శివ మాట్లాడుతూ.. 1980 నవంబర్ 3న పంజాబ్‌లోని లూధియానాలో ఆవిర్భవించిన డివైఎఫ్ఐ నాటి నుంచి నేటి వరకు దేశ యువత హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందని అన్నారు. నిరుద్యోగం, పేదరికం, సామాజిక అసమానతలు, విద్యారంగ సమస్యలకు వ్యతిరేకంగా యువతను సంఘటితం చేస్తూ ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల విలువల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. డివైఎఫ్ఐ ప్రస్థానం కేవలం ఒక సంస్థ చరిత్ర మాత్రమే కాదని, వేలాది మంది యువత త్యాగాలు, నిర్బంధాలు, పోరాటాలు, అంకితభావంతో నిర్మితమైన చరిత్ర అని పేర్కొన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని, హక్కుల సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉగ్గం కోటేశ్వరరావు, నల్లగొర్ల రాజేష్, చిమట వెంకటేష్, చేవుల చింటు, రాజబోయిన రాందాస్, కొండ ముచ్చలరావు, ఉగ్గం రామారావు, చిమట సర్వేశ్వరరావు, చిలక సాయి, కుర్రం మచ్చలరావు, ప్రవీణ్, పరిటాల రామయ్య, శ్రీను, ఉగ్గం నర్సింహారావు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో పాల్గొన్న ఎస్ఆర్ఆర్ విద్యార్థిని శ్రీనిత్యకు అదనపు కలెక్టర్ అభినందనలు

(జక్కుల శ్రీకాంత్

ప్రజా తీర్పు ప్రతినిధి) నవంబర్ 3

కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ూ)కు చెందిన బి.ఎస్సీ (మ్ూజం) తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం. శ్రీనిత్య అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ (లోక్‌సభ)లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం పొందింది.వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్--2026 రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన శ్రీనిత్యకు ఈ అవకాశం లభించింది. పార్లమెంట్ వేదికపై పాల్గొని కళాశాలతో పాటు కరీంనగర్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డా. అశ్విని తనాజీ వాకడే శ్రీనిత్యను ప్రత్యేకంగా అభినందించి, ఆమె విజయాన్ని ప్రశంసించారు. విద్యార్థులు జాతీయ స్థాయి వేదికలపై ప్రతిభ చాటుతూ ప్రజాస్వామ్య విలువలు, దేశాభివృద్ధి, యువత బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనిత్య విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, జిల్లా యువజన అధికారి ఎం. తిరుపతి, చీూా అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా. కె. సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, టి. రాజయ్య, చీూా ప్రోగ్రామ్ ఆఫీసర్లు బి. ఎలిజబెత్ రాణి, డా. కె. అర్జున్, డా. పి. తిరుపతి, ఎం. వెంకటేశ్వర్లు, జి. రాజేందర్‌తో పాటు కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య స్పృహ, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. శ్రీనిత్య మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల కుటుంబం ఆకాంక్షించింది.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అచలాపూర్ విద్యార్థిని ఎంపిక

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు

తాండూర్ మండలం రిపోర్టర్) నవంబర్ 03

తాండూర్ మండలం అచలాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మారిశెట్టి అమూల్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఏ. సాంబమూర్తి తెలిపారు.పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.మంచిర్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మారిశెట్టి అమూల్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో నవంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆమె ఎంపికైంది.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అమూల్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలుకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, వార్డు సభ్యుడు పాపయ్య, సీనియర్ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, అచలాపూర్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



మంథని పట్టణంలో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- పట్టణ అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి
- రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి.. రూ.40 లక్షలతో మరో రోడ్డు నిర్మాణం
- కౌన్సిలర్ పెంటరి రాజు

మంథని, నవంబర్-03 (ప్రజాతీర్పు)

మంథని పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని 10వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ నుంచి దహగం వారి మూల వరకు రూ.40 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే డిపో ముందు గల గోదావరిఖని ప్రధాన రహదారి నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకు, రెడ్డి భవన్ నుంచి ఎరుకల గూడెం ప్రధాన రహదారి వరకు మొత్తం రూ.2 కోట్ల 56 లక్షలతో పనులు చేపట్టగా, అందులో రూ.2 కోట్ల 25 లక్షల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన రోడ్డు నిర్మాణంలో భాగంగా భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేస్తూ సుమారు 30 ఛాంబర్ల నిర్మాణంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలతో కొనసాగుతున్నాయని, పట్టణంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పెంటరి రాజు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఏఈ మౌనిక, కాంట్రాక్టర్ శ్రీరామ్ పరిశీలించారు.



లారీ నుండిపడిపోయిన జేసీబీ.. తృటిలో తప్పిన ప్రమాదం

- భారీ వాహనాల తరలింపులో నిర్లక్ష్యం వద్దు.
- సీఐ వెంకటేష్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 3 ప్రజాతీర్పు

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ వద్ద భారీ హిటాచీ జేసీబీనడి రోడ్డుపై లారీ నుండి కింద పడిపోవడంతో కొద్దిసేపు తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మంగళవారం లారీలో తరలిస్తున్న హిటాచీ జేసీబీ ఒక్కసారిగా అదుపుతప్పి బస్టాండ్‌పై పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు, వాహనదారులుఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డిపేట సీఐ ఓ.వెంకటేష్, ఎస్ఐ రమేష్ పరిశీలించారు. హిటాచీ జేసీబీని తరలిస్తున్న వాహన డ్రైవర్లను సీఐ వెంకటేష్ హెచ్చరించారు. భారీ యంత్రాలను తరలించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎలా రవాణా చేస్తారని ప్రశ్నించారు. ఇలాంటి భారీ వాహనం జనాలపై పడితే ఎందరి ప్రాణాలు పోయేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా భారీ వాహనాలను తరలించేటప్పుడు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హిటాచీ జేసీబీ బస్టాండ్‌పై పడటంతో సిరిసిల్ల--కామారెడ్డి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ఎస్ఐ రమేష్ ప్రత్యేక చొరవ తీసుకొని రెండు భారీ క్రేన్లను రప్పించి హిటాచీ జేసీబీని అక్కడి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టారు. పోలీసుల పర్యవేక్షణలో తొలగింపు ప్రక్రియ పూర్తికావడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమై వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ప్రమాద సమయంలో ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం, పోలీసులు వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంపై స్థానికులు ఊరట వ్యక్తం చేశారు.



డిసెంబర్ 15 నుండి ఆశాలు నిరవధిక సమ్మె

- మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు
- బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

నర్సంపేట నవంబర్ 3 ప్రజా తీర్పు ప్రతినిధి

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నారని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజులి అన్నారు. ఈరోజు నర్సంపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మరియు బాంజీపేట మెడికల్ ఆఫీసర్లకు ఆశలతో కలిసి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఫిక్స్ వేతనంగా 18 వేల రూపాయలు ఇస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని పలుమార్లు ప్రభుత్వానికి తమ సమస్యల పరిష్కరించాలని విన్నవిచ్చిన చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా ఉందని అందుకే డిసెంబర్ 15 నా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశలు తాము చేస్తున్న విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నారని అన్నారు. ఈ లికార్యక్రమంలో పిపి యూనిట్ అధ్యక్షురాలు సంధ్య బాంజీపేట పి హెచ్ సి అధ్యక్షురాలు సునీత నాయకులు లలిత రమ సరోజన లత విజయ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలి

- రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులు పంపిణీ చేయాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) నవంబర్ 03



నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని భారంగా మారుస్తున్నాయని, ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులు పంపిణీ చేయాలని కోరుతూ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మల్లు లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ, వాటిలో చాలా హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. కూరగాయలు, పప్పులు, వంటనూనె, వంటగ్యాస్ ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలు కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం మాత్రమే ప్రజల ఆహార అవసరాలను తీర్చడానికి సరిపోదని అన్నారు. బియ్యంతో పాటు కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, వంటనూనె, చక్కెర, గోధుమలు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను ప్రతి నెలా ఉచితంగా లేదా సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వం ఆచరణలో చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి, భద్రత, సమానత్వానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని మల్లు లక్ష్మి కోరారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పేదలకు ఇళ్ల, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దేశంలో పెరుగుతున్న మతతత్వ రాజకీయాలు, ఫాసిస్టు ధోరణులు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు సవాలుగా మారుతున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, మహిళలపై హింస వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులు, లౌకిక విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకుల పంపిణీని ప్రారంభించాలని మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ప్రజల ఆహార భద్రత, మహిళల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఐద్వా పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు డి. అన్నపూర్ణ, టౌన్ కార్యదర్శి సి.హెచ్. రోజా, జిల్లా నాయకురాలు, డివిజన్ అధ్యక్షురాలు రజిని, డివిజన్ కార్యదర్శి నాగమణి, నాయకురాళ్లు శారద, మానస, కనుకవ్వ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 3

ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి, విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలు, సివిల్ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది, తాగునీటి సదుపాయాలు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, ఇతర సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. విద్యార్థుల వసతి గృహాలు, వంటగదిని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. నీటిని వృథాను అరికట్టాలని, ప్రతి నీటి బొట్టును బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. నీటి వృథాకు కారణమవుతున్న లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ఎఫ్ ఆర్ ఎస్ వివరాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధాన భవనం వెలుపల లైటింగ్ సదుపాయం సరిగా లేని విషయాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యూ ఐ డి సి ఎఈ బషీర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గుత్తేదారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కిడ్నీ బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన వసుధ ఫౌండేషన్

ఆపదలో ఉన్న మహిళకు అండగా వసుధ ఫౌండేషన్

(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూక్య సందీప్ ప్రజాతీర్పు ప్రతినిధి) నవంబర్ 03

కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వైద్య చికిత్స ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవతకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది. వైద్య చికిత్స నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాస్ రాజు బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు కుంజా సంతోష్ మాట్లాడుతూ, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ విద్య, వైద్య రంగాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించి, బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్జునపూడి సక్కుబాయి, హరిబాబు, రాజేష్, భూక్యా సాయి కౌశిక్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడు తోట ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 3 ప్రజా తీర్పు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం బాబు క్యాంపులో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు తోట ప్రసాద్ జన్మదిన వేడుకలను స్నేహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, తోట ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తోట ప్రసాద్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మిత్రులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాతరగ నరేష్, మద్దాల అనిల్, అన్నబోయిన రంజిత్ కుమార్, ఎస్. గిరి, దొడ్డపల్లి మహేష్, కే. హరీష్, ఉమాశంకర్ తదితర చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

కాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక తనిఖీలు

- ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత
- బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 3



రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బెల్లంపల్లి బస్తీలో టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ హాజరై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో శాంతిభద్రతల పరిస్థితులు, చట్టవ్యతిరేక కార్యకలాపాల పై ఆరా తీసి, నేరాల నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా పోలీసులు కాలనీలోని ఇళ్లను తనిఖీ చేసి నివాసితుల వివరాలను పరిశీలించారు. అలాగే వాహన తనిఖీలు నిర్వహించి సుమారు 80 వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనదారులు సరైన ధ్రువపత్రాలను సమర్పించిన అనంతరం నిబంధనల ప్రకారం వాహనాలను అప్పగిస్తామని, లేని పక్షంలో చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీపీ స్పష్టం చేశారు. కాలనీలో లేదా పరిసర ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానం కలిగితే ప్రజలు భయపడకుండా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకుండా వాటి నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. నంబర్ ప్లేట్లు లేకుండా లేదా అనుమానాస్పదంగా వాహనాలపై సంచరిస్తున్న వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే వారితో నేరుగా వాగ్వాదానికి దిగకుండా, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ-చలాన్లు లేదా ట్రాఫిక్ చలాన్లు పడుతున్నాయనే కారణంతో వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి తిరగడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చలాన్లకు భయపడాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.కాలనీలో స్వీయ రక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీసులతో ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అక్రమ కార్యకలాపాలు, గాంజా తాగే వారి వివరాలు మరియు సప్లై దారుల వివరాలు పోలీస్ వాళ్లకి తెలియచేయాలని వారు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుత పౌరులుగా సహకరించాలని ఏసీపీ కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,రూరల్ ఇన్స్పెక్టర్ హనోక్, తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య,సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

కాషాయ జనసందోహం... జనసంద్రంగా నిర్మల్

- ప్రజాస్వామ్య పరిరక్షణకు కాషాయ దళం కదం తొక్కింది

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజాతీర్పు)



నిర్మల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాదయాత్రకు ప్రజలు, బీజేపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. కాషాయ జెండాలతో నిర్మల్ పట్టణం జనసంద్రంగా మారింది. ఎస్ ఐ ఆర్ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతుగా ప్రజలు భారీ సంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మన తెలంగాణలో మీ అందరి ఓట్లు దండుకొని రేవంత్ రెడ్డి మూటలు మోస్తున్నాడు. ఆయన పదవి కాపాడుకునేటందుకు ప్రతివారం ఢిల్లీకి మూటలు పంపి, ఢిల్లీలో రెన్యువల్ చేసుకుంటూ... ఈరోజు రాహుల్ గాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తా ఉన్నావు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా విస్మరించింది ?4,000 పెన్షన్, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతు భరోసా పథకాలను అమలు చేయకుండా మోసం చేశారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికే ఢిల్లీకి మూటలు మోస్తూ, గాంధీ కుటుంబం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారూ, నరేంద్ర మోదీ కోట్లాది మంది ప్రజల గుండెల నుంచి పుట్టిన వ్యక్తి. ఈ కోట్ల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న వ్యక్తి. ప్రజల చేత మూడోసారి ఎన్నుకోబడ్డ ఒక మహానాయకుడిని కేవలం 10 మంది కాక్రోచ్‌లు ఏం చేస్తారు? అశేషంగా తరలివచ్చిన నా యువత, నా మహిళలు, నా ఆడపడుచులు, నా విద్యార్థులు, నా రైతన్నలారా... ఇంత దూరం నా వెంట నడిచి, మా అందరినీ ఆశీర్వదించి, వర్షాన్ని కూడా లెక్కచేయకుండా మీరు మాకు ఆశీర్వదించినటువంటి మీ అందరికీ మనస్ఫూర్తిగా రెండు చేతులు జోడించి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ... భారత్ మాతా కీ జై! భారత్ మాతా కీ జై!"అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ మహా పాదయాత్ర ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా: ,బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సీలాల్ , తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు,రామ్ చందర్ రావు,తెలంగాణ ఇన్‌చార్జి, బండి సంజయ్ కుమార్, కేంద్ర మంత్రి, అభయ్ పాటిల్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి, రేఖా శర్మ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి, ఈటల రాజేందర్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ ఏం ఎల్ ఎ మల్కా కొమరయ్య, మండలి సభ్యులు (మీజ), అంజిరెడ్డి, శాసన మండలి సభ్యులు (మీజ), ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ , ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి , నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్య నారాయణ,సిర్పూర్ ఏం ఎల్ ఎ పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ,తదితర బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అడిషనల్ అడ్వకేట్ జనరల్‌తో సాదుల పవన్ కుమార్

సిద్దిపేట జిల్లా,నవంబర్ 03 ప్రజా తీర్పు

తెలంగాణ హై కోర్ట్ అడిషనల్ అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డిని ఏఎంసీ వైస్ చెర్మెన్ సాదుల పవన్ కుమార్ హైదరాబాద్ హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ రంగానికి సంబంధించిన అంశాలతో పాటు ప్రజా సమస్యలపై ఇరువురు చర్చించారు. ప్రస్తుత న్యాయ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యే అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయపరంగా పరిష్కరించే మార్గాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రజినీకాంత్ రెడ్డితో సమావేశం కావడం సంతోషంగా ఉందని సాదుల పవన్ కుమార్ పేర్కొన్నారు. న్యాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై విలువైన అభిప్రాయాలను పంచుకునే అవకాశం లభించిందన్నారు.

ఆలయ భూమిని కబ్జా నుంచి కాపాడాలి

- ఐదు ఎకరాల భూమి అన్యాక్రాంతంపై విచారణ జరిపించాలి
- ఎంపీ రఘునందన్‌రావుకు వినతి - జిల్లా శ్రీనివాస్, ఉడుత మల్లేశం

సిద్దిపేటజిల్లా, నవంబర్ 03 ప్రజా తీర్పు



సిద్దిపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి కేటాయించిన భూమి అన్యాక్రాంతానికి గురైందని, ఆలయ భూమిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్, దేవాలయాల పరిరక్షణ సమితి నాయకుడు ఉడుత మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం. రఘునందన్‌రావును కలిసి ఆలయ భూమికి రక్షణ కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో వెంకటేశ్వర స్వామి ఆలయం పేరు మీద ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సూచనల మేరకు అప్పటి ఆర్డీవో వెంకట నరసయ్య ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని ఆలయానికి కేటాయించారని పేర్కొన్నారు. అయితే సిద్దిపేట ప్రజలు, దాతల సహకారంతోనే వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం జరిగిందని వివరించారు. ఐదు ఎకరాల భూమి కేవలం ఒక సంవత్సరం మాత్రమే ఆలయ పేరు మీద ఉండి, ఆ తర్వాత సంబంధిత వ్యక్తి కుమారుల పేర్లకు మార్చినట్లు ఆరోపించారు. చివరకు ఆలయ పేరు మీద కేవలం ఒక ఎకరం మాత్రమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూమి ఆలయం పేరు మీదకు ఎలా వచ్చింది? ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు ఎలా జారీ అయ్యాయి? అనే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేవాలయాల భూములు, ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా ప్రశ్నించలేని వారికి రాజకీయాల్లో పోటీ చేసే అర్హత లేదని అన్నారు. ఆలయ భూములు, ఆస్తుల పరిరక్షణ కోసం సిద్దిపేటకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు కలిసికట్టుగా ముందుకు వచ్చి తమకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దేవాలయ ఆస్తుల పరిరక్షణ సమితి నాయకులు సత్యం, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ ఫిర్యాదు వివరాలు లీక్ చేయడం సబబేనా?

- జమ్మికుంట ఎంఈవో, కోరపల్లి జెడ్ పి హెచ్ ఎస్ హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి.
- విద్యార్థి నాయకుడు నల్లగాష హరీష్ యాదవ్ డిమాండ్.

జమ్మికుంట నవంబర్ 03 ప్రజాతీర్పు



సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించినందుకు ఫిర్యాదుదారుడి వివరాలు ఇతరులకు చేరవేయడమేనా? అలా చేయడం ఎంతవరకు సబబు? విద్యాశాఖ కార్యాల యంలో ఫిర్యాదుల వివరాల గోప్యతకు భద్రత లేదా? అని జమ్మికుంట మండల విద్యార్థి నాయకుడు నల్లగాష హరీష్ యాదవ్ ప్రశ్నించారు. ఆర్టిఐ ద్వారా ఓ ప్రైవేట్ పాఠశాల కిడ్జీస్కూల్‌పై ఫిర్యాదు చేస్తే, ఆ సమాచారం కోరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ రెడ్డికి సిఆర్పి ద్వారా ఎలా చేరిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఐ ద్వారా ఫిర్యాదు చేసిన విషయం బయటకు వెళ్లడం, అనంతరం కోరపల్లి జడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి తనకు ఫోన్ చేసి మాట్లాడటం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫిర్యాదుపై విచారణ జరపాల్సిన అధికారులు, ఫిర్యాదు వివరాలు ఇతరులకు చేరేలా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టిఐ ద్వారా ప్రశ్నిస్తే ఫిర్యాదుదారుడి వివరాలు బయటపెట్టే అధికారం ఎవరిచ్చారు? ఎంఈఓ కార్యాలయంలో ఏం జరుగుతోంది? సిఆర్పి ద్వారా సమాచారం చేరవేసిన వారి వెనుక ఎవరున్నారు? అంటూ నిలదీశారు.ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న తప్పులను ప్రశ్నించకూడదా? అని అడిగారు. పాఠశాలల వ్యవహారాలపై సమాచారం కోరితే ఫిర్యాదుదారుల వివరాలు ఇతరులకు చేరవేసి వారిపై ఒత్తిడి తీసుకొచ్చే పరిస్థితులు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు అత్యంత తీవ్రంగా పరిగణించాలని, ఫిర్యాదు వివరాలు ఎలా బయటకు వెళ్లాయనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నల్లగాష హరీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆర్టిఐ ద్వారా ప్రశ్నించడం పౌరుల హక్కు అని.. ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేయడం సహించేది లేదనీ, విద్యాశాఖలో బాధ్యతారాహిత్యానికి అడ్డుకట్ట వేయకపోతే ఉన్నతాధికారుల దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్తామని హెచ్చరించారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన చేస్తే కఠినచర్యలు

డిఎస్పీ నాగేంద్ర చారి

ఎల్లారెడ్డిపేట నవంబర్ 3 ప్రజాతీర్పు



మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన సయ్యద్ జుబేర్ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అతని నేర ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకొని అతనిపై మంగళవారం రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించే వారిపై, ముఖ్యంగా మహిళలను వేధిస్తూ అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని సిద్దిపేట జిల్లా పరిధిలో ఉన్న మూడు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్...

సిద్దిపేట జిల్లా నవంబర్ 03 ప్రజా తీర్పు

ఎల్ నినో ప్రభావంతో సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మూడు మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆయా మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మొత్తం ఏడు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన ఐదు మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరువు మండలాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

కుంభం రాజయ్య ముదిరాజ్ కుటుంబానికి గుప్పెడు సాయం

- ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ముదిరాజ్ సేవా సమితి నాయకులు, దాతలు
- నివాళులర్పించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

నర్సంపేట నవంబర్ 3 ప్రజా తీర్పు ప్రతినిధి



స్టేషన్ ఘనపూర్ పట్టణానికి చెందిన కుంభం రాజయ్య ముదిరాజ్ ఇటీవల రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యంతో మృతి చెందడంతో నిరుపేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కడు పేదరికంలో జీవిస్తున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్న దృష్టికి తీసుకెళ్లారు దీంతో ముదిరాజ్ దాతల సహకారంతో బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, పెసరు సారయ్య తదితరులు మృతుని స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక కుల పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లిరాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వేరైనా, ఆపద సమయంలో కుల బంధువులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. స్టేషన్ ఘనపూర్ ముదిరాజుల ఐక్యత, మానవత్వానికి ఈ సహాయ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలోని ముదిరాజ్ కుల పెద్దలు ఇలాంటి ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువత విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు, తమ స్థాయికి తగిన విధంగా పేదలకు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. స్థానిక కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య మాట్లాడుతూ సిద్దిపేటలో ఉన్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్నకు కుంభం రాజయ్య కుటుంబ పరిస్థితిని తెలియజేయగానే వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. లిఈ సహాయానికి సహకరించిన పెసరు రాజన్నతో పాటు దాతలందరికీ గ్రామ ముదిరాజ్ కుల బంధువుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, స్థానిక కౌన్సిలర్లు పొన్నం స్వరూప, పెసరు కృష్ణవేణి సారయ్య, రాజయ్య ముదిరాజ్, సేవకులు దండు చిరంజీవి ముదిరాజ్, స్థానిక పట్టణ కుల పెద్దలు కుంభం గణేష్, సాంబరాజు, రాము, కుమారస్వామి, రవి, రాము, సుధాకర్, కుంభం మధు, కుంభం రామస్వామి శంకర్, వై. రాజు, బాబు తదితరులతో పాటు కీర్తి శేషులు రాజయ్య సతీమణి వినోద, ముగ్గురు కుమార్తెలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



KDCC బ్యాంకు అధ్యర్యంలో మృతుని కుటుంబానికి భీమా చెక్కు అందజేత

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) నవంబర్ 03

జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని మనాల గ్రామం కు చెందిన సిలివేరు కిషన్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు.తనకు నామిని అయినా భార్య సిలివేరు శ్యామల కు 200000/-(రెండు లక్ష ల రూపాయల బీమా)(ప్రధాన మంత్రి జీవన జ్యోతి గ్రూవీజీజీడీ) బీమా చెక్కు ను ఖణజజ బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ మరియు ఉప సర్పంచ్ తిరుపతి గ్రామ పంచాయతీ హనుమాన్ చౌరస్తా లో అందజేశారు. అనంతరం మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు బీమా సదుపాయం కల్గి ఉండాలి అని మరియు ఆపద సమయంలో బీమా కొండంత అండగా ఉంటుంది అని అన్నారు ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ మరియు జఖీం కౌన్సిలర్ లు వెంకటేష్. రమేష్. విజయ్. మరియు ఎఽషష బ్యాంకు సిబ్బంది మరియు డైరెక్టర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



అనంతారం 2 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) నవంబర్ 03

జగిత్యాల జిల్లా అనంతరం అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ చేర్మెన్ బత్తిని రవీనా మహేష్ గారి ఆధ్వర్యంలో గర్భిణీ బాలింతలు తల్లులు పిల్లల కూ ప్రతి నెల బరువులు ఎత్తులు తుయించి వారి పిల్లల ఆరోగ్యం గురించి తలుసుకోవాలని తల్లుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని అవగానా కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని రవీనా మహేష్ ఉపసర్పంచ్ బత్తిని సునందా తిరుపతి వార్డ్ మెంబర్ అమీనా అమీర్ తల్లులు పిల్లలు అంగన్వాడీ టీచర్ నర్సమ్మ ఆయా లత తదితరులు పాల్గొన్నారు.



ఉస్మాన్ అలీ శస్త్రచికిత్స కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం

(వినోద్, ప్రజా తీర్పు, మౌలాలి, మల్కాజిగిరి) నవంబర్ 03

ఆర్టీసీ కాలనీ శివానంద్ నగర్ కాలనీ చెందిన ఉస్మాన్ అలీ అనే క్యాన్సర్ బాధితుడికి నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు నాయకులు కృషి చేశారు. శస్త్రచికిత్సకు సుమారు రూ.1 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలియజేయడంతో, బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, ప్రజా నాయకుడు మైనంపల్లి హనుమంతరావు సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించిన. (గూజ) అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, జనరల్ సెక్రెటరీ సలీం సీనియర్ నాయకుడు ఫారూఖ్, జిల్లా కార్యదర్శి మందా భాస్కర్, జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, చంద్రకాంత్, మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, మౌలాలి మైనారిటీ అధ్యక్షుడు షకీల్, పాండురంగాచారి బాబా ప్రవీణ్ ఇతర కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

కొబ్బరి బొండాల మాటున 8 పశువుల అక్రమ రవాణా

- నంబర్ ప్లేట్ లేని ట్రాలీలో తరలింపు..
- ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



కొబ్బరి బొండాల మాటున పశువులను తరలిస్తున్న అక్రమ రవాణా వ్యవహారాన్ని మరిపెడ పోలీసులు గుర్తించారు. రాత్రి గస్తీలో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన నంబర్ ప్లేట్ లేని టాటా ట్రాలీని తనిఖీ చేయగా అందులో 8 పశువులు ఉన్నట్లు బయటపడింది. మరిపెడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు నరేష్, జి. శ్రీను పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొబ్బరి బొండాలతో వెళ్తున్న ట్రాలీపై అనుమానం వచ్చి తనిఖీ చేశారు. వాహనంలో కొబ్బరి బొండాల కింద కాళ్లు, మెడలకు తాళ్లతో కట్టివేసిన 6 ఆవులు, 2 కోడెగిత్తలను గుర్తించారు. పశువులను కదలలేని స్థితిలో తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి ప్రాంతానికి చెందిన గొర్ల శివ, యలమచిలీ శివ, బంగారి లచ్చన్నలను నిందితులుగా గుర్తించారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి పశువులను సేకరించి, కొబ్బరి బొండాల మాటున హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు మరిపెడ ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసులు పశువులను రక్షించి పశువైద్యులతో చికిత్స అందించారు. గాయపడిన పశువులు ప్రస్తుతం కోలుకున్నట్లు వెల్లడించారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన టాటా ట్రాలీని సీజ్ చేసి, ముగ్గురు నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పశువుల అక్రమ రవాణా, జంతువుల పట్ల క్రూరత్వానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అదనపు కలెక్టర్ (సివిల్ సప్లయస్) డి.విజయంధర్ రెడ్డిలి

(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి) నవంబర్ 03 :-



తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలు ఈక్రింది విధంగా ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలు: తెలంగాణ దీూ బియ్యం: కిలో రూ. 66. తెలంగాణ సోనా బియ్యం: కిలో రూ. 74 తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం: కిలో రూ. 79. రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో, సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇంత వరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేయబడినవి. జిల్లా సరఫరల అధికారి మరియు సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు తనిఖి లు చేయచున్నారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదే విధంగా ప్రతి రిటైల్ మరియు హోల్ సేల్ వ్యాపారి వారి షాప్ ముందు ఈ క్రింది విధంగా బ్యానర్ ప్రజలకు కనపడేలా ఏర్పాటు చేయాలి.

వరంగల్‌లో ఘనంగా ప్రారంభమైన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

- 1,458 మంది పోలీసు క్రీడాకారుల భాగస్వామ్యం.
- మూడు రోజుల పాటు పోటీలు

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



పోలీసు విధుల్లో ఎదురయ్యే పని ఒత్తిడిని అధిగమించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఐజీ గజారావు భూపాల్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026 (క్లస్టర్--డి) ప్రారంభమైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను ఐజీ గజారావు భూపాల్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాల మైదానాల్లో వివిధ క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన సుమారు 1,458 మంది పోలీసు క్రీడాకారులు ఈ క్రీడా సంబరాల్లో పాల్గొంటున్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్, సంబంధిత అధికారులను ఐజీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, పోలీసు అధికారులు, క్రీడా నిర్వాహకులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్

మెదక్, నవంబర్ 03,(ప్రజా తీర్పు ప్రతినిధి):

మంగళవారం కమిషనర్, పౌర సరఫరాల శాఖ వారి ఆదేశాల మేరకు, మెదక్ పట్టణంలోని ఆర్ష్‌దీప్ సూపర్ మార్కెట్, జి.వి. సూపర్ మార్కెట్‌తో పాటు ఇతర బియ్యం విక్రయ దుకాణాలలో మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలని సంబంధిత వ్యాపారులకు అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామన్నారు.

ప్రభుత్వం సూచించిన గరిష్ట విక్రయ ధరలు:
దీూ / ఖచీవీ బియ్యం: కిలోకు రూ.66/-
=చీ= / తెలంగాణ సోనా బియ్యం: కిలోకు రూ.74/-
ఎమీ / జీూ= బియ్యం: కిలోకు రూ.79/-

పై ధరలకు మించి బియ్యం విక్రయించరాదని వ్యాపారులను హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ పి. నిత్యానందం, అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారి శ్రీ ఎం.డి. అబ్దుల్ నిస్సార్, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీ తాటి నర్సింలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: బీజేపీ

మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ

మెదక్,నవంబర్03(ప్రజా తీర్పు ప్రతినిధి):



ఎలినినో ప్రభావం మూలంగా వర్షాలు పడక పంటలు ఎండి పోతున్నాయని,కరువు నివారణ చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ఆరోపించారు.మంగళవారం రోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరువు నివారణతో జిల్లాలో ఖరీఫ్ సీజన్ తీవ్రమైన సంక్షోభం ఎదురుకుంటుందన్నారు.మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉంటే కేవలం ఒకే ఒక్క మనోహరబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించటం విడ్డూరంగా ఉందని, ఇది ఎంత వరకు సమంజసమో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు.మిగతా మండలాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.ఎకరానికి పంట నష్టం రూ.50000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.జిల్లాలో తాగు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని,త్రాగు నీటి సరఫరా కోసం ప్రత్యేమ్నాయ చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో రైతులు వేసిన పంటల వివరాలను ప్రకటించి,ఎన్ని ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి తదితర వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.గ్రామం యూనిట్గా పంట నష్టాన్ని లెక్కించాలన్నారు.జిల్లా కలెక్టర్ ఎండిపోయిన రైతుల పంటలను పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా అధికారులు ఎండిన పంటలను నిర్దిష్టంగా అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.జిల్లాలో రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి సీఎంఆర్ అప్పగించని రైస్ మిల్లర్పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఎంఆర్ కోసం సేకరించిన ధాన్యంలో 3029 టన్నుల బియ్యం తక్కువగా ఉన్నాయని గుర్తించిన అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.జిల్లాలో రైస్ మిల్లులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

పీఎం రాహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం
- భూపాలపల్లి సిరి శెట్టి సంకీర్త్ ఐపీఎస్

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ప్రమాద బాధితులకు ఆర్థిక భారం లేకుండా అత్యవసర వైద్యం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎం రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో కిరణ్ ఆసుపత్రి, యోధా ఆసుపత్రి, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహకం అందించేందుకు రహవీర్ పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జాతీయ స్థాయి అవార్డులు కూడా అందజేస్తారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని కోరారు. ప్రమాద బాధితులను చూసి నిర్లక్ష్యంగా వెళ్లిపోకుండా మానవతా దృక్పథంతో స్పందించాలని, సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు.

విద్యుత్ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం!

పాపన్నపేట,మెదక్ నవంబర్ 03, (ప్రజా తీర్పు ప్రతినిధి):



రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంగళవారం నార్సింగిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్(ఖఎ గాబఎఫ్ఱఅశీఅ)లో వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతులు, విద్యుత్ వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పాపన్నపేట, అల్లాదుర్గం, రేగోడు మండలాలకు చెందిన వినియోగదారుల నుంచి మొత్తం 14 పిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.ప్రధానంగా లైన్ షిఫ్టింగ్, డీటీఆర్ సమస్యలు, 33/11 కేవీ సబ్‌స్టేషన్ సంబంధిత పనులు, ఎల్టీ లైన్ మార్పు, అదనపు విద్యుత్ లోడ్లు, 11 కేవీ లైన్ షిఫ్టింగ్, అంతర్గత విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలపై వినతులు అందజేశారు. వినియోగదారులు సమర్పించిన ప్రతి దరఖాస్తును అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు, గృహవిద్యుత్వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వెంకటేశ్వరరావు, ఏఈలు నర్సింలు, ఉదయ్ భాస్కర్, నవాజ్, శ్యాంసుందర్, నర్సింలు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సేవలు సమాజానికి ఆదర్శం

- జిల్లా కల్యాణమండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మేయర్, డిప్యూటీ మేయర్‌కు విజ్ఞప్తి

(జక్కుల శ్రీకాంత్, ప్రజా తీర్పు ప్రతినిధి) నవంబర్ 3:



కరీంనగర్: సమాజ సేవలో నాయీ బ్రాహ్మణుల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి జిల్లా కల్యాణమండపం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సన్మానించారు.అనంతరం నగరంలో నిర్మాణంలో ఉన్న జిల్లా కల్యాణమండపం పనుల పురోగతిని వివరించి, మిగిలిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. కల్యాణమండపం నిర్మాణం పూర్తయితే నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి వివిధ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య నాయీ, జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్ నాయీ, జిల్లా ప్రచార కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ నాయీ, బోనకూర్తి శంకర్ నాయీ, అవుదుర్తి రవికుమార్ నాయీ, నగర అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ నాయీ, ప్రధాన కార్యదర్శి సూరంపల్లి సంజీవ్ కుమార్ నాయీ, కోశాధికారి కంది వెంకటేష్ నాయీ, జిల్లా యువజన సంఘం కో-కన్వీనర్ ఓరుగంటి వేణు నాయీతో పాటు నగర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ప్రచార కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం





- గ్రామ ప్రథమ పౌరులకు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు
- సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్

హుస్నాబాద్ నవంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు

ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని చిగురు మామిడి మండలంలోని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక విషయంలో కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని,స్థానిక సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా అర్హులను ఎలా గుర్తిస్తారని మండిపడ్డారు.ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్ లను ఇలా అగౌరవపరచడం సరైనది కాదని ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ చత్రునాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్న సర్పంచ్‌కు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా,సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.సర్పంచ్‌లుగా మాకు సమాచారం లేనప్పుడు ఇక మేము ఎందుకు..? ఈ పదవులు ఎందుకు..? అంటూ సమావేశంలో తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు.అధికారుల తీరును నిరసిస్తూ సభలో నిలదీశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పరిస్థితులపై సర్పంచ్ రమేష్ స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రత్యేక అధికారి తెలిపారు.ఈ మండల సర్వసభ్య సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,ఎంపీఓ కిరణ్ కుమార్,మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని మూడు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ నవంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు



ఎల్ నినో ప్రభావంతో సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ మూడు మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆయా మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మొత్తం ఏడు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన ఐదు మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరువు మండలాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



డీఎస్పీకి సన్మానం

ఎల్లారెడ్డి పేట, ప్రజాతీర్పు, నవంబర్ 3

అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామి ఘనంగా సత్కరించారు. 2003నుంచి2005వరకుఎల్లారెడ్డిపేట ఎస్సైగా నాగేంద్ర చారి విధులు నిర్వర్తించగా గతం లో తాను చేసిన పనులను గుర్తు చేసుకుంటూ డాక్టర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.డిఎస్పి నాగేంద్ర చారి ఎల్లారెడ్డిపేట ఎస్సైగా, సిరిసిల్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గా, వేములవాడ డిఎస్పిగా పని చేశారు.గత ఏడాది నవంబర్ 23న సిరిసిల్ల డిఎస్పీ గా నాగేంద్ర చారి బాధ్యతలు స్వీకరించారు.గతనలభైఏళ్ళుగా సత్యనారాయణ స్వామి వైద్య వృత్తిలో కొనసాగుతూ ఉండగా, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి హైదరాబాద్ కు ధీటుగా వైద్య సేవలు అందించటం తో డిఎస్పీ ,డాక్టర్ సత్యనారాయణ స్వామి సేవలను ప్రశంసించారు.ఇటీవలే సుమారు మూడు కోట్ల వ్యయం తోఈప్రాంత ప్రజలకు గుండెకు సంబంధించిన వైద్య పరికరాలు,క్యాత్ లాబ్ నుఅందుబాటులోకి తెచ్చి సుమారు వంద మందికి పైగా స్టంట్ లు వేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి వైద్య సేవలు అందించారు. నాలుగు దశాబ్దాలుగా విద్యుత్ లో మమేకమై గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తేవడం హర్షించదగిందని డి.ఎస్.పి నాగేంద్ర చారి పేర్కొంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో అశ్విని నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజ్ భాస్కర్ ఉన్నారు.



పర్యావరణహితమైన వ్యవసాయ పద్ధతుల్లో రైతులను ప్రోత్సహించాలి

- జిల్లా వ్యవసాయాధికారి చత్రు నాయక్
- ఇందుర్తి రైతువేదికలో ఘనంగా "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం


హుస్నాబాద్ నవంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు

చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి రైతువేదికలో రైతుల సంక్షేమం, వ్యవసాయ భూముల పరిరక్షణ మరియు స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్ విచ్చేసి మాట్లాడారు. "ఖేత్ బచావో అభియాన్" ద్వారా వ్యవసాయ భూముల పరిరక్షణ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, సహజ వనరులను సంరక్షించడం, రసాయనాల వినియోగాన్ని సమతుల్యం చేయడం, పర్యావరణహితమైన మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను రైతుల్లో ప్రోత్సహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు. జమ్మికుంట శాస్త్రవేత్త వేణు గోపాల్ మాట్లాడుతూ.... ఆరోగ్యకరమైన నేల, సురక్షితమైన ఆహార ఉత్పత్తి మరియు రైతుల ఆర్థిక స్థిరత్వానికి భూమిని కాపాడుకోవడం ఎంతో అవసరమని తెలియజేశారు. ఎల్ ని నో కారణంగా నీటి లభ్యత కూడా తక్కువగా ఉంటుంది కాబట్టి తక్కువనీటితో పండించే కూరగాయల సాగు చేయడం మంచిదని కార్యక్రమంలో వివరించారు.ఏ డి ఏ శ్రీధర్, పాక్స్ చైర్మన్ రవీందర్, సర్పంచ్ చింతపుల రవీందర్ ముఖ్య వక్తలుగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి టి. పున్నం చందర్, పీఏసీఎస్ చైర్మన్ చిట్టమల్ల రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఏఈఓలు సతీష్, ప్రణయ్ హాజరయ్యారు.



మ్యాక్స్‌వెల్ గుడ్‌బై

సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. నిరుడు వన్డేల నుంచి వైదొలిగిన అతడు.. తాజాగా ఇంటర్నేషనల్‌తో పాటు లిస్ట్-ఏ, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కూ గుడ్‌బై చెప్పాడు. అయితే ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అతడు బిగ్‌బాష్ లీగ్‌లో 2027-28 సీజన్ వరకు ఆడనున్నాడు.



చీరలో మెరిసిపోతున్న రకుల



వాస్తవ సంఘటన ఆధారంగా '13'

జీవీ ప్రకాశ్‌కుమార్, గౌతమ్ వాసుదేవమీనన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్ థ్రిల్లర్‌కి '13' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రానికి వివేక్.కె దర్శకుడు. భవ్య త్రిఖ, ఆదిత్య కతిర్, ఐశ్వర్య, అధియా ప్రసాద్ ఇతర పాత్రధారులు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. దట్టమైన అటవీ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, వాస్తవ సంఘటన స్ఫూర్తితో రూపొందుతున్న ఈ చిత్రం 13 సంఖ్యకు సంబంధించిన రహస్యాన్ని, దుష్టశక్తుల బారిన పడిన వ్యక్తుల పోరాటాన్ని ఆవిష్కరిస్తుందని, ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసేలా సినిమా ఉంటుందని దర్శకుడు వివేక్ తెలిపారు. డిసెంబర్‌లో సినిమా విడుదల కానున్నది. ఈ చిత్రానికి సంగీతం: సిద్ధు కుమార్.



గాయపడ్డ వ్యక్తి జీవిత కథ

అగ్ర కథానాయకుడు దేవరకొండ విజయ్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్దన'. గోదావరి తీరంలోని కళింగపట్టణం గ్రామ నేపథ్యంలో సాగే ఈ రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్‌కి రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈచిత్రం డిసెంబర్‌లో విడుదల కానున్నది. రెండు భాగాలుగా సినిమాను విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్లు ఉన్నట్టు వార్తలు కూడా వస్తున్నాయి.



అలా నమితను కాస్తా మమితనయ్యా



'ప్రేమలు' సినిమా మమితాబైజు తలరాతను మార్చింది. ఆ సినిమాలోని ఆమె నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆ ఒక్కసినిమాతోనే దక్షిణభారతం మొత్తం మమితకు ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత వచ్చిన డ్యూడ్, జననాయగన్, విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలు ఆమెను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ప్రస్తుతం తమిళంలో 'ఇరందు వానమ్', మలయాళంలో 'హలో డియర్' సినిమాలు చేస్తూ మమిత బిజీగా ఉన్నది. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పేరుకు సంబంధించిన ఓ రహస్యాన్ని బయటపెట్టింది మమితా బైజు. నిజానికి ఆమె పుట్టగానే తల్లిదండ్రులు పెట్టిన పేరు నమిత. అయితే.. బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే క్రమంలో అధికారుల పొరపాటు కారణంగా 'నమిత' అనే పేరు కాస్తా.. 'మమిత'గా మారిపోయిందట. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ 'ఈ విషయం అమ్మానాన్నలకు కూడా వెంటనే తెలియలేదు. నాలుగేళ్ల వయసులో నన్ను స్కూల్‌లో చేర్పించడానికి నా బర్త్ సర్టిఫికెట్‌ని పరిశీలించగా ఈ తప్పు బయటపడింది. అప్పటికే అఫీషియల్ డాక్యుమెంట్స్ అన్నింటిలో మమితా అనే పేరే నమోదైపోవడంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. అలా నమితను కాస్తా మమితను అయ్యాను' అంటూ చెప్పుకొచ్చింది మమితాబైజు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020